క్లుప్తంగా

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ



పిప్పరలో విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేసిన ఆర్టీసీ అధికారులు

గణపవరం: పాఠశాలల్లో చదివే విద్యార్థులు వారి గ్రామాలనుంచి పాఠశాలకు వెళ్లడానికి దాతల సహకారంతో ఉచితంగా బస్‌పాస్‌లు అందిస్తోందని, ఈఅవకాశాన్ని విద్యా ర్థులు వినియోగించుకోవాలని తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ వైఎస్ఎన్‌మూర్తి తెలిపారు. సోమవారం గణపవరం మండలం పిప్పరలో పలు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు అందజేశారు. ముప్పర్తిపాడుకి చెందిన కొవ్వూరి చినరామిరెడ్డి తన భార్య నాగసత్యవతి జ్ఞాపకార్థం ఆయన ఆర్థిక సహకారంతో బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఆర్టీసీ సూపర్‌వైజర్ డీవీ కుమార్, హెచ్‌ఎం పి.జయవెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వాసుబాబు పర్యటన

గణపవరం: ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈనెల 25వ తేదీ మంగళవారం ఉదయం 9.30 గంటలకు గణపవరం మండలం మొయ్యేరులో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు. 11.30 గంటలకు నిడమర్రు మండలం చిననిండ్రకొలనులో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రతినిధి సింగులూరి సుభాష్ తెలిపారు.

కంసాలిగుంటలో ఉపాధ్యాయులకు సత్కారం

ఉంగుటూరు : కంసాలిగుంటలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు కముజు ప్రేమకుమార్, దుర్గా ప్రసాదిని, లక్ష్మీనారాయణను గ్రామస్తులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ముండ్రుశాంతి శ్రీకాంత్, మండల విద్యాశాఖాధికారి కె. శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శి రమ్య, వెల్ఫేర్ సహాయకులు నుజహర్ అలీ, ఉపాధ్యాయ సంఘం నాయకులు పునుముల రాంబాబు, డాకి జోగి నాయకుడు, కాంప్లెక్స్ సెక్రటరీ, గణేష్, హరికృష్ణ, అల్లు శ్రీను, గొల్లపల్లి రామారావు, శ్రీధర్, జయరాజు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పనిచేసిన ఉపాధ్యాయులను గుర్తు పెట్టుకుని గ్రామస్తులు సత్కరించడం అభినందనీయమన్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్

పెదపాడు: అక్రమంగా కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పెదపాడు పోలీసులు సోమవారం తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం సోమవారం పెదపాడు వైపునకు వ్యానులో కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పెదపాడు ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోళ్ల వ్యర్థాలను ధ్వంసం చేసామని ఆయన చెప్పారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ చల్లా తెలిపారు.

కోళ్లవ్యర్థాల వాహనాల సీజ్

దెందులూరు: కోళ్ల వ్యర్థాలను తీసుకువెళ్తున్న రెండు వాహనాలను సీజ్ చేశామని దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు. సోమవారం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఆదివారం రాత్రి సత్యనారాయణపురం వద్ద కోళ్ల వ్యర్థాలను ఆగడాలంకకు తీసుకువెళ్తున్న రెండు బొలెరో వాహనాలను అడ్డుకుని సీజ్ చేసి వాటిని స్వాధీన పరుచుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమ చేయాలి

ఏలూరు (టూటౌన్) : గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్రం విడుదల చేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమ చేయాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద జిల్లా సర్పంచ్‌ల ఛాంబర్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలకు సంబంధించి 15 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద సర్పంచ్‌ల ఛాంబర్ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించినట్లు తెలియజేశారు.

పంటలకు మద్దతు ధరపై చట్టం చేయాలి

ఏలూరు (టూటౌన్) : రైతు, కౌలు రైతులు పండించిన పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, కౌలురైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ కోరారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఈ మేరకు వినతి పత్రం అందజేసినట్లు వారు తెలియజేశారు. రైతులు, కౌలుదార్లకు రూ.10 వేల పంట సాయం అందించాలని కోరారు. కటాఫ్ తేదీతో నిమిత్తం లేకుండా కౌలుకార్డులు ఉన్న వారందరికీ రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలన్నారు. రూ. 2 లక్షల వరకూ పంట రుణాలు మాఫీ చేయాలని, రైతు రుణవిమోచన చట్టం తేవాలని వారు కోరారు.

సమస్యల పరిష్కారమే 'జగనన్న సురక్ష' లక్ష్యం



భీమడోలు: చెట్టున్నపాడులో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే జగనన్న సురక్ష లక్ష్యమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మండల వ్యాప్తంగా ముగింపు రోజైన సోమవారం చెట్టున్నపాడులో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ జల్లూరి వెంకట నరసమ్మ అభిమాన్యు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వాసుబాబు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. వైఎస్ జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారని అన్నారు. జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా నియోజకవర్గంలో ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో వేలాది మందికి ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి క్షణం ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నారని అన్నారు. వలంటీర్లపై విషం కక్కుతున్న ప్రతిపక్షాలకు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం వందలాది మందికి ధ్రువీకరణ పత్రాలను అందించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ పి.విజయరాజు, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీ వనమాల సుజాత నాగదత్త, ఆగడాలలంక సర్పంచ్ భలే రాంబాబు, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఓరా జయరాజ్, సైదు కరుణాకర్, మేడిశెట్టి వెంకట్, కుచ్చెర్ల శాంతి రాజు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో ధ్రువపత్రాల పంపిణీ

పెదవేగి : వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజల ముంగిటకు ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి ఉచిత సేవలందిస్తున్నారని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. పెదవేగి మండలం న్యాయంపల్లి గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం ఈ సర్టిఫికెట్లు పొందటానికి గతంలో ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ అనేక సార్లు తిరగాల్సి వచ్చేదని, అలాంటిది సచివాలయాల వద్ద ఒక్కొక్కరికీ రెండు, మూడు సర్టిఫికెట్లు కూడా ఉచితంగా పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎంపీపీ అన్నారు. అనంతరం 11 రకాల సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకున్న వారి అభ్యర్థనలు పరిశీలించి 660 మందికి ధ్రువపత్రాలు అందించారు. సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ తూముల అరుణకుమారివేణుగోపాల్ (రాజు), ఉపసర్పంచ్ దేవరపల్లి కిరణ్, మండల వైస్ ఎంపీపీ బొబ్బూరి నాగేశ్వరరావు, తహసీల్దార్ ఎన్ నాగరాజు, ఈవోఆర్డీ బీ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ బలుసు సాయికుమార్‌చౌదరి ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముందూరులో...

జగనన్న సురక్ష పేరుతో పలు రకాల ధ్రువపత్రాలు ఉచితంగా అందించడంపై సర్వత్రా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని సర్పంచ్ రాచూరి దేవిబాలస్వామి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ముందూరులో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 1,302 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు నాయకులు అందించారు. అనంతరం నాయకులు, అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, సర్పంచ్ రాచూరి దేవిబాలస్వామి, ముందూరు సొసైటీ ప్రెసిడెంట్ చైర్మన్ చెరుకూరి ప్రసాద్, స్థానిక నాయకులు బలుసు శేఖర్, రత్తయ్య, ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

427 ధ్రువీకరణ పత్రాలు అందజేత

దెందులూరు: జగనన్న సురక్ష కార్యక్రమం అన్నివర్గాల ప్రజలకు వరమని ప్రభుత్వం అందిస్తున్న 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అధికారులు గ్రామాలకు వచ్చి అందించడం గొప్ప సంస్కరణగా మండల ప్రత్యేకాధికారి ఎస్.కృపావరం, పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్ అన్నారు. సోమవారం పోతునూరు స్వరాజ్ భవన్‌లో సర్పంచ్ బోదుల స్వరూప్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జగనన్న సురక్షలో అందిస్తున్న సేవలను ప్రత్యేకాధికారి కృపావరం తహశీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య వివరించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. అనంతరం వంద రకాల మొక్కలను అధికారులు, ప్రజాప్రతినిధులు నాటారు. వైఎస్సా ర్‌సీపీ నాయకులు, ఎంపీటీసీ సున్నా నరేష్, తలారి రామకృష్ణ, రమేష్, బుద్దా అర్జున, బీశెట్టి నూకరాజు, ఏఈలు చౌదరి, రాజేంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, గ్రామ ప్రజలు ఉన్నారు.



పెదవేగి : న్యాయంపల్లిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, స్థానిక నాయకులు, అధికారులు



దెందులూరు: పోతునూరులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రత్యేకాధికారి కృపావరం, సర్పంచ్ బోదుల స్వరూప్

వలంటీర్లకు వందనం

సేవాభావంతో పని చేస్తున్న వలంటీర్లు



సున్నా నరేష్

దెందులూరు: వలంటీర్లందరూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కుల, మత, వర్గం, ప్రాంతం చూడకుండా సేవా భావంతో వారి విధులు నిర్వహిస్తున్నారు. పెన్షనర్లు గ్రామంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోని వైద్యం తీసుకుంటున్న వారికి సొంత ఖర్చులతో వెళ్లి పెన్షన్ల నగదును అందజేస్తున్నారు. కరోనా సమయంలో సైతం ప్రాణాలు లెక్కచేయకుండా ప్రతిఒక్కరి వద్దకు వెళ్లి సేవలందించారు. వలంటీర్లందరికీ నాగవంశీయుల సంఘం పూర్తి మద్దతు ఉంటుంది. వలంటీర్ల జోలికి వస్తే సహించేది లేదు.

మా వలంటీరు చదువు నేర్పించింది



కొత్త ఉంగుటూరులో చదువు నేర్పుతున్న వలంటీరు ఆదిలక్ష్మి (ఫైల్)

ఉంగుటూరు: కొత్త ఉంగుటూరులోని వలంటీరు చీపురుపల్లి ఆదిలక్ష్మి బీఈడీ పండిట్ చదుకుంది. పోటీ పరీక్షలకు సిద్ధ మవుతూ ప్రభుత్వం కేటాయించిన విధులు నిర్వహిస్తోంది. అంతేకాకుండా తన పరిధిలోని కుటుంబాల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదువు నేర్పించింది. దాంతో ఇప్పుడు ఆమె పరిధిలోని సుమారు 15మంది సంతకం చేయడంతోపాటు ప్రస్తుతం పదాలు చదవగలుగుతున్నారు. వలంటీరు చేసిన మేలు ఎన్నటికీ మరవలేమని గ్రామంలోని 15 మంది చెబుతున్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని మాకు సక్రమంగా వలంటీరు అందించడంతోపాటు, మాకు చదువు చెప్పడంతో అక్షర వెలుగును చూడగలుగుతున్నామని పథకాల లబ్ధిదారులు చల్ల అప్పయ్యమ్మ, పండూరి కుమారి తెలిపారు.

వలంటీర్ల సేవలపై విమర్శ తగదు



నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లను విమర్శించడం తగదు. చదువురాని మా లాంటివాళ్లకు మా వలంటీరు ఆదిలక్ష్మి అక్షరాలు నేర్పించింది. ఇప్పుడు చిన్న పదాలు చదవగలుగుతున్నాం. కరోనా సమయంలో వలంటీర్లు ఎంతో సేవ చేశారు. బాధితులకు, వారి కుటుంబాలకు అండగా ఉన్నారు. వైద్య సేవలు, మందులు, నిత్యావసరాలు, కూరగాయలు బాధిత కుటుంబానికి తెచ్చి అందించేవారు. ఎటువంటి కష్టం వచ్చినా వలంటీర్లు మేమున్నామంటూ కుటుంబసభ్యులుగా వచ్చి సాయమందిస్తున్నారు. ప్రభుత్వ సేవలు పేదలకు సక్రమంగా అందేలా వలంటీర్లు కృషి చేస్తున్నారు.

– పండూరి కుమారి, కొత్త ఉంగుటూరు

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- రూ.26 లక్షల వ్యయంతో నిర్మించిన రహదార్ల ప్రారంభోత్సవం
- ఎమ్మెల్యే వాసుబాబు



చేబ్రోలులో సీసీ రహదార్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: గ్రామాలు అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం చేబ్రోలులో రూ.26 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రహదార్లను వాసుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాల్లో అంతర్గత రహదార్లను సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లుగా అభివృద్ధి చేశామన్నారు. ప్రధానంగా చేబ్రోలులో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశామని అన్నారు. రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనం వెల్ నెస్ సెంటర్ నిర్మాణాలతో గ్రామంలో రూపురేఖలు మార్చామని అన్నారు. రానున్న ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని వాసుబాబు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, మండల కన్వీనర్ మరడ మంగరావు, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావు బాబ్జి, మాజీ సర్పంచి కరణం బుజ్జి, ఎంపీటీసీ సభ్యులు రాయిలక్ష్మి, మనసాల నాగమణి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ముత్తా బుజ్జి, డీఈ శ్రీనివాసరావు, నాయకులు పత్తి నాగు, రంగ, కో ఆప్షన్ సభ్యుడు నజీర్, నందరపు అప్పలరాజు, బాబా వల్లీ పాల్గొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వాసుబాబు ఇచ్చిన హామీ మేరకు రహదారి అభివృద్ధికి రూ.20 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలు ఎంపీపీ గంట శ్రీలక్ష్మి ఇచ్చారు.

ఎమ్మెల్యే వాసుబాబు పరామర్శ

ఉంగుటూరు: చేబ్రోలులో కళ్లపల్లి నానాజీ తల్లి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వాసుబాబు సోమవారం స్థానిక నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించారు. వైసీపీ నాయకులు యెలిశెట్టి పాపారావు బాబ్జి, మరడ మంగరావు, పుప్పాల గోపి, పుత్సకాలయ విష్ణుమూర్తి, ఆకుల రాజ తదితరులు ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు తాగునీటి సరఫరా



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ఎస్.కృపావరం, తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య

దెందులూరు: కొవ్వలిలో నియో జకవర్గ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు మరమ్మతుకు గురైన మోటారుకు ప్రత్యామ్నాయంగా రూ. 30 వేలతో కొత్త మోటారు కొనుగోలు చేసి విద్యార్థులకు తాగునీరు సరఫరా చేస్తున్నామని దెందులూరు మండల ప్రత్యేకాధికారి, జిల్లా మైనార్టీ అధికారి ఎస్.కృపావరం అన్నారు. కొవ్వలిలో ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య మాట్లాడుతూ ఇటీవల హాస్టల్‌లో రాత్రి బస చేశామన్నారు. ఆ సమయంలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుని తాగునీటికి వారు పడుతున్న ఇబ్బందులను గుర్తించి పరిష్కరించామన్నారు. వారి వెంట హాస్టల్ ఏఓ గోల్డెన్ రాజు ఉన్నారు.

భారీ వర్షం.. రైతుల హర్షం

- 62.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- రోడ్లన్నీ జలమయం



దుగ్గిరాల దంత కళాశాల సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు



పొలాల్లో వర్షంలో తడుస్తూ వరినాట్లు వేస్తున్న కూలీలు

పెదవేగి : భారీ వర్షంతో రైతుల మోము వికసించింది. పంట పొలాలకు ఈ వర్షం జీవం పోసింది. సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో మెట్ట ప్రాంతమైన పెదవేగిలో రైతులు హర్షం వ్యక్తం చేశా రు. ఆది, సోమవారాల్లో పెదవేగిలో 62.2 వర్షపాతం నమోదైందని తహసీల్దార్ తెలిపారు. సోమవారం రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో గ్రామాల్లో పలుచోట్ల లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగజేసింది. భారీగా పడిన వర్షంతో రహదారి పెద్ద మడుగులా మారింది. వాహనాలు వెళ్లే సమయంలో సమీపంలో ఉంటే బురదనీరు చిమ్మి దుస్తులు పాడవుతున్నాయని పాదచారులు పేర్కొంటున్నారు. రహదారి ఒడ్డున మట్టిపోసి, నీరు పోకుండా అడ్డుకోవడాన్ని గ్రామస్తులు, ప్రయాణికులు ఆక్షేపిస్తున్నారు. ఈ వర్షాలు సాగుకు ఎంతో ఉపకరిస్తాయని రైతులు చెబుతున్నారు. వర్షంలో కూలీలు, నాట్లు వేసేందుకు ఉత్సాహాన్ని కనబరిచారు. జల్లులా కురుస్తున్న వానలో ఆడుతూ...పాడుతూ నాట్లు వేస్తూ, పొలాల్లో రైతులు, కూలీలు సందడి చేశారు.

వర్షం నీటితో నిండిన అండర్‌పాస్



దెందులూరులో నిర్మిస్తున్న అండర్‌పాస్ వద్దకు చేరిన వర్షం నీరు



భీమడోలు జంక్షన్‌లో ప్రధాన రహదారిపై వర్షం నీరు

దెందులూరు: దెందులూరులో నిర్మిస్తున్న రైల్వే అండర్‌పాస్ పక్కన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు చేరుకుంది. దీంతో అటుగా వెళ్లే గ్రామస్తులు, విద్యార్థులు, కూలీలు ఇక్కట్లకు గురవుతున్నారు. ఇటీవల కేంద్ర రైల్వే జోనల్ యూజర్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ ఇటీవల ఆకస్మిక తనిఖీ చేసి కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి అండర్ పాస్‌కి రెండు వైపులా తాత్కాలికంగా నడకకు రోడ్డు మార్గం, బురద నీటిని తోడేందుకు మోటారు ఏర్పాటు చేయాలని కోరారు. కాంట్రాక్టర్ వెంటనే అండర్‌పాస్‌కు రెండు వైపులా ప్రయాణికులకు నడవటానికి ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మించారు. బురద నీరు తొలగించేందుకు మోటారు ఏర్పాటు చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం నీటితో అండర్ పాస్ నిండిపోయింది. సోమవారం రైల్వే కన్సల్టెన్సీ కమిటీ మెంబర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ పరిశీలించి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

భీమడోలు: అల్ప పీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయి. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, కొల్లేరు గ్రామాల్లో రోడ్లపై వర్షం నీరు చేరింది. దీనితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వైపుగా వెళ్లే రోడ్డు భవనాల శాఖ రోడ్డు బురదమయంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్ ఏర్పాటు చేస్తే మురుగునీరంతా బయటకు పోతుందని గ్రామస్తులు అంటున్నారు. భీమడోలు రాజులవీధిలోని రోడ్డంతా వర్షం నీటితో నిండిపోయింది. దీంతో గోతులు కనిపించ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఈ రోడ్లపై గోతులు పూడ్చి మరమ్మతులు చేసినా ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ గుంతులు ఏర్పడ్డాయి.

మహిళల ఆర్థికాభివృద్ధికి పథకాలు దోహదం



కొత్తూరులో ధ్రువపత్రాలు అందిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని, మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. మండలంలోని కొత్తూరులో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగాంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజలకు మరింతగా సంక్షేమ పథకాలు చేరువ చేసేందుకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాలు క్యాలెండర్ ప్రకారం అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని అన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్న లక్ష్యంతో అనేక పథకాలతోపాటు ఇళ్ల స్థలాలు వారికి అందిస్తున్నారని అన్నారు. అన్నదాతలకు అండగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందించి పండిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందన్నారు. నిత్యం ప్రజల మధ్య తిరుగుతూ సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కృషి చేస్తున్నారని అన్నారు. గ్రామంలో పుంత రోడ్ల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం కేటాయించడమే ప్రభుత్వ లక్ష్యమని బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు తెలిపారు. పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, సర్పంచ్ కడిమి పద్మావతి, సీనియర్ నాయకుడు కడిమి గోవిందరావు, తాళ్లగూడెం సర్పంచ్ ఇల్లూరి జోజి, నాయకులు కోట గోవర్ధన్, విజయ్, గుణుపూరు మహేష్ పాల్గొన్నారు.

హంపీ పీఠం ఆస్థాన సిద్ధాంతికి ఘన సత్కారం



పోలసానిపల్లిలో కాశీభొట్ల కృష్ణ ప్రసాద్‌శాస్త్రిని సత్కరిస్తున్న గ్రామస్తులు

భీమడోలు: పోలసానిపల్లికి చెందిన ప్రముఖ పంచాంగకర్త హంపీ పీఠం ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మశ్రీ కాశీభొట్ల వీరవెంకట నాగేశ్వర కృష్ణప్రసాద్ శాస్త్రిని ప్రజలకు అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు మరవలేనివని పలువురు వక్తలు కొనియాడారు. పోలసానిపల్లిలోని ఆయన ఇంటి వద్ద సోమవారం ఆయనను దుశ్శాలువాతో పాటు జ్ఞాపిక అందించి ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాంగకర్తల సమాఖ్య ఆధ్వర్యంలో ఆయన 48 ఏళ్లుగా ద్వారకా తిరుమల, హంపీ పీఠాలకు సిద్ధాంతి కర్తగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన 100 మంది పంచాంగకర్తలు సమక్షంలో ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో దేవదాయ ధర్మశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఘనంగా సత్కరించారు. ఈ నేపథ్యంలో పోలసానిపల్లిలోని ఆయన స్వగ్రామానికివెళ్లిన అభిమానులు, ఆధ్యాత్మిక చింతన కలిగిన వ్యక్తులు ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీభొట్ల పార్వతీశ్వర ప్రసాద్ శాస్త్రి, వైసీపీ నేతలు మద్దాల అప్పారావు, సుతాపల్లి ప్రసాద్, పెద్దలు గంధం భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు దెందులూరులో 'జగనన్న సురక్ష'

దెందులూరు: దెందులూరు గ్రామ పంచాయతీలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దెందులూరు శివారు ప్రాంతాల ప్రజలు మంగళవారం నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అందించే 11 రకాల ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొంటారని తెలిపారు. ఈ శిబిరం వద్ద ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అచ్చమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి దాతల విరాళం

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన దాత అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి మినరల్ వాటర్ ప్లాంట్ అధినేత కొండపల్లి రామకృష్ణ, చంద్రమణి దంపతులు రూ. 25 వేలు సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన పెద్దిశెట్టి రాంబాబు జ్ఞాపకార్థం పెద్దిశెట్టి సురేష్, ఉమానాగశ్రీ దంపతులు రూ. 10,116 అందే నాగసుబ్బారావు, పద్మ దంపతులు రూ. 10,116 విరాళంగా అందజేశారు. దాతలందరికీ ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న సురక్ష పథకంతో పేదలకు మేలు



తల్లాపురంలో కొబ్బరి మొక్క నాటుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ జయలక్ష్మి

ఉంగుటూరు: జగనన్న సురక్ష పథకం ద్వారా పేదలకు ఎంతోమేలు జరుగుతోందని ఎంపీపీ గంట శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం తల్లాపురం, ఉంగుటూరులో జగనన్న సురక్ష సమావేశాలు నిర్వహించారు. తల్లాపురం సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉచితంగా ప్జలకు సర్టిఫికెట్లు అందజేయడం హర్షణీయమన్నారు. జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా బలోపేతమయ్యేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే వాసుబాబు నిరంతరం పనిచేస్తున్నారని అన్నారు. సర్పంచి పసుపులేటి నర్సింహరావు అధ్యక్షతన తల్లాపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎల్‌డీవో జి. వెంకటరమణ, ఎంపీడీవో ఆంజనేయులు, డీటీ బొడ్డేపల్లి ప్రసాదు పాల్గొన్నారు. కొబ్బరి మొక్కలను ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు నాటారు. ఉంగుటూరులో జరిగిన సురక్ష సమావేశంలో సచివాలయాల మండల కన్వీనర్, ఎంపీటీసీ పెనుగొండ బాలకృష్ణ, ఎంపీటీసీ సందక రాంబాబు తహసీల్దారు వెంకటరమణ, ఈవోపీఆర్డీ షంషుద్దీన్, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు పాల్గొన్నారు. వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ప్రజల అవసరమైన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు.